VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 15 శుక్రవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 110

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# రూ.5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

- గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి
- విద్యాశాఖకు బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు
- రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి బాలల దినోత్సవం
- హాస్టళ్లలో ఫుడ్‌పాయిజనింగ్ జరిగితే చర్యలు
- ఎల్బి స్టేడియంలో బాలల దినోత్సవంలో సిఎం రేవంత్

**హైదరాబాద్:** రూ.5వేల కోట్లతో రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవలే హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచామన్నారు. రాష్ట్రంలో గత పదేళ్లలో 5వేల పాఠశాలలు మూతపడ్డాయి. బడ్జెట్‌లో 7 శాతానికి పైగా నిధులు విద్యాశాఖకు కేటాయించాం. ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలని పదోన్నతులు ఇచ్చాం, బదిలీలు చేశాం. 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశాం. టీచర్ పోస్టుల భర్తీ ద్వారా విద్యపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని నిరూపించామని సీఎం తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థుల కలలను నిజం చేయడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. 'రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత తొలి ప్రధానే కాదు.. దేశాన్ని ప్రపంచం ముందు గొప్పగా చూపించిన నేత అని,. నవీన భారత రూపశిల్పి నెహ్రూ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. వర్సిటీలకు ఉపకులపతులను నియమించాం. విద్యా వ్యవస్థను బాగు చేసేందుకు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశాం. ప్రభుత్వ టీచర్లకు ఉన్న అర్హత ప్రైవేటు ఉపాధ్యాయులకు లేదు. అయినా పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించడానికి ఇష్టపడట్లేదు. ప్రభుత్వ బడుల ప్రతిష్ఠ పెంచే బాధ్యత టీచర్లదే. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో విద్యార్థులను కలిసి సమస్యలు

తెలుసుకోవాలి. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 7 వరకు విజయోత్సవాలు నిర్వహిస్తున్నాం. అనుకున్న విధంగా బాలల దినోత్సవం రోజున ఉత్సవాలు ప్రారంభించాం అన్నారు. అధికారులు జిల్లాల్లో రెండు రోజుల పాటు పాఠశాలలను పర్యవేక్షించాలి. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవాలి. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి అన్నం పెట్టాలి. దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకునేది లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకపోతే జైలుకు పంపుతాం. గత సీఎంను ఏనాడైనా మీరు చూశారా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను ఏనాడైనా చూశారా? ఈ రోజు మీ రేవంత్ అన్న మీతో చేయి కలిపాడా.. లేదా? దేశానికి ఆదర్శంగా ఉంటామని.. ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాబోమని విద్యార్థులు ప్రమాణం చేయాలని సీఎం కోరారు. ప్రభుత్వ హాస్టల్స్, గురుకులాల్లో ఇటీవల జరుగుతోన్న ఫుడ్ పాయిజన్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు తినే ఆహారంలో కల్తీ జరుగుతోంది. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు, బల్లులు వస్తున్నాయి.

ఇక నుండి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం పెట్టకపోతే జైలుకు పంపుతాం. విద్యార్థులకు గ్రీన్ ఛానెల్ ద్వారా కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలి. విద్యార్థులకు సన్నబియ్యంతో మంచి ఆహారం పెట్టాలి. ముఖ్యమంత్రి, మంత్రులు తినే సన్న బియ్యమే గురుకులాల విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ఎక్కడైనా విద్యార్థులకు దొడ్డు బియ్యం, కుళ్లిన కూరగాయలతో భోజనం పెడితే ఊరుకోం' అని సీఎం రేవంత్ రెడ్డి స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని.. ఈ విద్యార్థులే రాష్ట్ర భవిష్యత్ అన్నారు. ఇందులోనే కాబోయే ఇంజనీర్లు, డాక్టర్లు, ముఖ్యమంత్రులు ఉన్నారన్నారు. ఈ వేదికగా మీ కళల్ని ప్రదర్శించే అవకాశం నాడు ఇచ్చారా..? కానీ మీ రేవంత్ అన్న మిమ్మల్ని కలుసుకున్నాడు.. మీతో ఉన్నాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌కు వినపడేలా విద్యార్థులు చప్పట్లు కొట్టాలని ఈ సందర్భంగా స్టూడెంట్స్‌కు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పండగ పేరుతో సారా బుడ్లతో దొరికిన వారికి శిక్ష తప్పదని పరోక్షంగా కేటీఆర్‌ను హెచ్చరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



2లో

## తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్

- ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న రెండు పార్టీలు
- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం దుర్మార్గం
- ప్రధానికి స్వాగతం పలకని వారు మాకు పాఠాలు చెబుతారా
- మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

## అధికారం కోల్పోవడంతో రెచ్చగొట్టే యత్నాలు



**ప్రభుత్వాన్నికూల్చే కుట్రలో బిఆర్ఎస్ నేతలు**

**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క విమర్శలు**

**హైదరాబాద్:** అధికారం కోల్పోయిన భారాస నేతలు ప్రజలను రెచ్చగొడుతున్నారని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మండిపడ్డారు. లగచర్ల ఘటనతో వారి కుట్రలు బట్టబయలు అయ్యాయని అన్నారు. అధికారం లేకపోవడంతో తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు. ఉన్న ప్రభుత్వాన్ని కూల్చడం పైనే ఆ పార్టీ దృష్టి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలని భట్టి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో భట్టి మాట్లాడారు. 'నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా అని నిలదీసారు. రైతు రుణమాఫీ చేయడం వైఫల్యమా అని నిలదీసారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెట్టడం ప్రభుత్వ వైఫల్యమా? ఫార్మా క్లస్టర్స్ విస్తరణను వ్యతిరేకించడం బుద్ధి తక్కువ పని అన్నారు. కక్షపూరిత రాజకీయాలకు మేం వ్యతిరేకం అన్నారు. ప్రతిపక్షంగా భారాస తన పాత్ర పోషించిందా చెప్పాలని నిలదీశారు. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. దాని ప్రకారం చేసి చూపిస్తున్నాం. ఇది విప్లవాత్మక నిర్ణయం.. రాష్ట్రాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. దేశానికి తెలంగాణ రోల్ మోడల్ కాబోతుంది.




2లో

## హైకోర్టును తప్పదోవ పట్టిస్తున్న సిఎం రేవంత్

- ఫార్మా భూమి అని చెప్పి ..ఫోర్ట్ సిటీ కోసం యత్నం
- లగచర్ల ఘటనతో రైతుల ఆగ్రహం బయటపడింది
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత కెటిఆర్



2లో

## జార్ఖండ్‌లో బిజెపిదే అధికారం

సోరెన్ ఇంటికి వెళ్లడం ఖాయమన్న అమిత్ షా

## గ్రూప్-4 ఫలితాలు విడుదల

హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 ఫలితాలను వెల్లడించింది. 8,084 మందితో కూడిన ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. 2022 డిసెంబర్ 1న ఇచ్చిన నోటిఫికేషన్‌లో భాగంగా 8,180 పోస్టులకు గాను 9,51,321 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కమిషన్ పేర్కొంది. పలు దఫాల్లో ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈరోజు ఫలితాలు వెల్లడించింది. పూర్తి వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని సూచించింది.



## రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం

- దాడులతో అరచాకం సృష్టిస్తే కఠినంగా అణచివేస్తాం
- లగచర్లలో దాడిని ఉపేక్షించేది లేదు
- రైతులకు నష్టం చేసే ఉద్దేశ్యం లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిక



2లో

## ప్రధాని మోడీకి 'కామన్వెల్త్ ఆఫ్ డొమినికా' అత్యుత్తమ పురస్కారం

న్యూ డిల్లీ :కరేబియన్ దేశమైన డొమినికా దేశం గురువారం ఆ దేశ అత్యున్నత పురస్కారం 'కామన్వెల్త్ ఆఫ్ డొమినికా' అనే పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీకి ప్రకటించింది. కోవిడ్-19 మహమ్మారి కాలంలో భారత్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటించారు. 2021 ఫిబ్రవరి నెలలో దాదాపు 70,000 డోసుల 'ఆస్ట్రాజెన్కా కొవిడ్-19 వ్యాక్సిన్ ను ఇండియా, డొమినాకా దేశానికి పంపింది. ప్రధాని మోడీకి ప్రకటించిన ఈ అవార్డును డిమినికా అధ్యక్షుడు సిల్వానీ బర్టన్ ఇండియా-కారికోమ్ సమాశంలో ప్రదానం చేస్తారు. అది గయానాలోని జార్జ్ టౌన్ లో నవంబర్ 19 నుంచి జరుగనుంది.



# మరోసారి విచారణకు రేవంత్‌రెడ్డి గైర్హాజరు

హైదరాబాద్: ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మరోసారి విచారణకు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చే నెల 16ను కేసు విచారణ వాయిదా పడింది. గురువారం విచారణ చేపట్టిన నాంపల్లి కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది. విచారణకు సండ్ర వెంకట వీరయ్య, ఉదయ్ సింహా, మత్తయ్య, సెబాస్టియన్ హాజరు కాగా, సీఎం రేవంత్ రెడ్డి, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరయ్యారు. కాగా, గత నెల 16న జడ్జి లీవ్‌లో ఉండటంతో కోర్టు కేసును నేటికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. 2015 మే 31న ఓటుకు నోటు కేసులో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మరో ఎమ్మెల్యే స్టిఫెన్‌సన్‌కు నోట్ల కట్టలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినట్టు అభియోగాలున్నాయి. దీనిపై ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. రేవంత్‌రెడ్డితోపాటు సెబాస్టియన్, ఉదయ్‌సింహ, సండ్ర వెంకటవీరయ్యతోపాటు రూ.50 లక్షలు సమకూర్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వేం కృష్ణకీర్తన్ తదితరులపై కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగానే ఓటుకు నోటు కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు గుర్తించిన ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నాంపల్లిలోని ఈడీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. అయితే, ఈడీ కోర్టు విచారణకు నిందితులు కొంతకాలంగా హాజరు కావడం లేదు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మిగతా నిందితులు సైతం కోర్టుకు హాజరుకాకుండా, గైర్హాజరీ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీనిని న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. నిందితులు కోర్టుకు హాజరుకాకుండా దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండిపడింది. మరోవైపు, ఏసీబీ నమోదుచేసిన ఓటుకు నోటు కేసు విచారణ కూడా నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్నది. ఈ కేసులో ఏ-1 నిందితుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఈ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని కోరుతూ ఇటీవల బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.



## జార్ఖండ్‌లో బిజెపిదే అధికారం

రాంచీ: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సర్కారుకు ఓటమి తప్పదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇక్కడ బిజెపి కూటమి గెలవడం ఖాయమని అన్నారు. ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని కోరకుంటున్నారని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నవంబర్ 23 రోజే సీఎం

హేమంత్ సోరెన్ అండ్ కంపెనీకి వీడ్కోలు అన్నారు. ఝార్ఖండ్‌లో మలివిడత ఎన్నికల ప్రచారం సందర్భంగా డుమ్రిలో ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. అధికార దురాశ వల్లే ఝార్ఖండ్ ఏర్పాటును వ్యతిరేకించిన ఆర్జేడీ - కాంగ్రెస్ ఒడిలో హేమంత్ సోరెన్ కూర్చోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న అమిత్ షా.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేశారన్నారు. ఝార్ఖండ్‌లో చొరబాట్లను హేమంత్ సర్కార్ ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే చొరబాటుదారులను బహిష్కరిస్తామన్నారు. అనేక పరిశ్రమలు నెలకొల్పి.. ఒక్క యువకుడు కూడా వలస వెళ్లకుండా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. హేమంత్ సోరెన్ గతంలో నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని సైతం నెరవేర్చలేదన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. యువతకు నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి కల్పించడంతో పాటు 2లక్షలకు పైగా ఖాళీ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

# ప్రభుత్వంపై వ్యతిరేకత కొడంగల్ నుంచే ప్రారంభమైంది

హైదరాబాద్: ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నారని, రైతుల నుంచి బలవంతంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి భూములు గుంజుకుంటున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ పగ ప్రతీకారంతో పట్నంను కుట్రపూరితంగా నరేందర్‌రెడ్డిని అరెస్ట్ చేయించారని ఆరోపించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలన మీద తిరుగుబాటు మొదలైందని.. ఈ అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మీకు ఓటేస్తే మేలు జరుగుతుందనుకుంటే పాపానికి.. లగచర్ల గ్రామం భూములను గుంజుకోవడమే నువ్వు చేసే మేలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. ఎక్కడ ఏం జరిగినా బీఆర్ఎస్‌పై పెడుతున్నారన్నారు. నిరుద్యోగులు, రైతులు, పోలీసులు స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని.. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్ఎస్ చేసిందనే అంటున్నారన్నారు. ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడడం ప్రతిపక్షాలుగా మా బాధ్యత అన్నారు. మమ్మల్ని అక్రమంగా కేసులు పెట్టాలనుకుంటున్నావేమో .. మాపై



కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయండి.. కానీ అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారని సీఎంని ప్రశ్నించారు. వెంటనే గిరిజన రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా ..? ప్రజాస్వామ్యమెక్కడుంది అంటూ నిలదీశారు.

మల్లన్నసాగర్‌లో రేవంత్ రెండురోజులు నిరసన చేస్తే మేం అడ్డుకున్నమా.. ? అని ప్రశ్నించారు. అర్ధరాత్రి మహిళల చాతిమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదన్నారు. ఈ ప్రజల తిరుగుబాటు ఆగదని.. రేవంత్‌ని గద్దె దించే దాకా నిద్రపోమన్నారు. మా ప్రభుత్వంలో 14వేల ఎకరాలు ఫార్మాసిటీ కోసం సేకరించామని.. అక్కడెందుకు ఫార్మాసిటీ కట్టరని ప్రశ్నించారు. ఇందిరమ్మ ముసుగులో దళితుల, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన ఇప్పుడు కనిపిస్తోందన్నారు. రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలన అని నిలదీశారు. రేవంత్ పాలన అదానీ, తమ్ముళ్లు, అల్లుళ్ల కోసమేనని.. బీఆర్ఎస్ పార్టీ దళిత, గిరిజనుల పక్షాన నిలబడుతుందని స్పష్టం చేశారు. కేటీఆర్‌పై సైతం కుట్రలు చేస్తున్నారని.. ఆ రోజు మల్లన్నసాగర్‌లో నీ మీద కేసులు పెట్టినమా అంటూ సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని.. నరేందర్ రెడ్డికి ఏ సంబంధం లేదన్నారు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో తెలియదని..

మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి ఒక్క నిముషం ముందు ఒత్తిడి చేసి నరేందర్‌రెడ్డితో సంతకం చేయించారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి బడాబాబులపై ప్రేమ ఉందన్నారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని.. ఆయనకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ధర్మమే గెలుస్తుందని.. న్యాయస్థానంలో తమకు న్యాయం జరుగుతుందన్నారు. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారన్నారు.

## హైకోర్టును తప్పుదోవ పట్టిస్తున్న సిఎం రేవంత్




హైదరాబాద్:తెలంగాణ హైకోర్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో భూముల ధరలు తగ్గాయని చెప్పారు. కాంగ్రెస్ మిగతా నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. లగచర్లలో ఉంది ఫార్మా భూమి అని హైకోర్టు కోర్ట్‌కు సీఎం రేవంత్ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బయటకు వచ్చి ఫోర్త్ సిటీ అంటున్నారని కేటీఆర్ విమర్శించారు.తెలంగాణ భవన్‌లో గురువారంమీడియా సమావేశం నిర్వహించారు. తెలంగాణ భవన్‌కు లగచర్ల భూసేకరణ గిరిజన కుటుంబాలు చేరుకున్నాయి. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉంటానని కేటీఆర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి సీట్ కోసం మంత్రులు ఎదురుచూస్తున్నారని కేటీఆర్ విమర్శలు చేశారు.

నల్గొండ ,ఖమ్మం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి , మల్లు భట్టి విక్రమార్క సీఎం చైర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ముందుగా తన సీట్ పోకుండా రేవంత్ రెడ్డి చూసుకోవాలని హితవు పలికారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భూముల ధరలు పెరిగాయని అన్నారు. ఏమైనా అభివృద్ధి చేస్తారేమోనని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. 'లగుచర్ల ఇష్యూతో సర్కారు బంగపడింది. లగచర్లలో అరెస్టు అయిన వారిని పోలీసులు తీవ్రంగా కొట్టారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి పెట్టి బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేశారు . పోలీసులు ఘోరంగా ప్రవర్తిస్తున్నారు. మా నాయకుడు సురేష్ తప్పేం చేశారు. నరేందర్ రెడ్డినీ ఎందుకు అరెస్టు చేశారు. నాలుగేళ్లలో మేమే అధికారంలోకి వస్తాం. ఆంధ్రలో ఏం జరిగిందో తెలంగాణలో అదే జరుగుతది. బీఆర్ఎస్ నేతలపై బోగస్ కేసులు పెడుతున్నారు. అధికారులకు అంత స్వామి భక్తి పనికి రాదు. రేవంత్ పిచ్చోడు.. అసలు వదలం. బాధితులను ఢిల్లీకి తీసుకెళ్తాం. నేషనల్ హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు చేస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు.

# తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్

న్యూఢిల్లీ:తెలంగాణ అభివృద్ధికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్ తదితరులపై మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉండగా ప్రధాన మంత్రి రాష్ట్రానికి వస్తే స్వాగతం పలకలేని మొఖాలు ఇవాళ మేమేం చేయాలో చెప్తయా.. అని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ సర్టిఫికేట్ మాకు అక్కర్లేదని అన్నారు.గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని విమర్శించారు. అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రచారం చేస్తోందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని... గవర్నర్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా లీగల్ ఒపీనియన్ తీసుకోవాల్సి ఉంటుందని ఈ క్రమంలో కొంత జాప్యం జరిగితే తొందరపాటుగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, అంతమాత్రాన బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే చెప్పడం అవివేకమని కిషన్ రెడ్డి అన్నారు. అవినీతి ఎక్కడ జరిగినా విచారణ జరపాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణకు



డిమాండ్ చేశామని, సీఎం రేవంత్ రెడ్డి విచారణ కోరారా.. అని ప్రశ్నించారు. గవర్నర్ నిర్ణయం తీసుకోవాలంటే లీగల్ ఒపీనియన్ అనేది ఉంటుందని చెప్పారు. అమృత్ టెండర్లపై జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ తామే కోర్టుకు వెళ్లామని గుర్తు చేశారు. ప్రజలతో తప్ప ఏ పార్టీతో బీజేపీ ములాఖత్ కాలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని సీరియస్ అయ్యారు.

వైఫల్యాలను, అసమర్ధత నుంచి దృష్టి మళ్లించేందుకు రెండు పార్టీలు పోటీ పడుతున్నాయని, కేటీఆర్, కేసీఆర్ ఇచ్చే సర్టిఫికెట్లు తమకు అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తే బయటకు రాని కేసీఆర్, కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. కలెక్టర్ మీద దాడి తప్పు అని.. కానీ గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టడం కూడా సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో జరిగిన ఘటన అని, ఆయన తన ప్రజలతో మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో బీజేపీ అధికారంలోకి రాబోతుందని, ఒక్క అవినీతి, కుంభకోణం ఆరోపణ లేకుండా బీజేపీ, శివసేన ప్రభుత్వ పాలన సాగిందని కిషన్ రెడ్డి అన్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్‌లో బొగ్గు శాఖ, గనుల శాఖ విడివిడిగా పెవిలియన్లు ఏర్పాటు చేశామన్నారు. కోల్ ఇండియా ప్రపంచంలోనే 3వ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారని, ఇది ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు. బొగ్గు వెలికితీత ముగిసిన తర్వాత ఆ గనులను పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడేలా ఎలా తీర్చిదిద్దాలి అన్న విషయంపై పనిచేస్తున్నామని చెప్పారు. బొగ్గు పరిశ్రమలో ప్రమాదాలు లేకుండా కార్మికుల క్షేమమే ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు రూపొందించామన్నారు. వచ్చే ఏడాది అక్టోబర్ వరకు కోల్ ఇండియా ఫౌండేషన్ డే ఉత్సవాలు నిర్వహిస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ అవసరాలకు 95 శాతం రాగి దిగుమతులు చేసుకుంటున్నామని, నిత్యజీవితంలో కాపర్ వినియోగం ఉంటుందని కిషన్ రెడ్డి తెలిపారు. కాపర్ సహా అనేక ఖనిజాలు, ధాతువులు, క్రిటికల్ మినరల్స్ విషయంలో ఆత్మనిర్భర్,

స్వయం సమృద్ధి సాధించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. క్రిటికల్ మినరల్స్‌లో లిథియం ఒకటని.. దాన్ని వెలికితీయడం కష్టతరమైన పక్రియ అని పేర్కొన్నారు. ఈ క్రమంలో కాబిల్ సంస్థను ఏర్పాటు చేశామని, ఇది వివిధ దేశాలు సందర్శించి లిథియం నిక్షేపాల వెలికితీత గురించి తెలుసుకుంటుందన్నారు. సముద్రగర్భంలో ఉన్న ఖనిజాల వెలికితీత గురించి వేలం పక్రియ నిర్వహిస్తామని, లిథియం విషయంలో ఆస్ట్రేలియా, అమెరికా, అరబ్ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని కిషన్ రెడ్డి తెలిపారు.

## రైతుల ముసుగులో గులాబీ గుండాల అరాచకం

**హైదరారాబాద్:** రైతుల ముసుగులో కొంతమంది గులాబీ గూండాలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు చేశారు. కుట్రపూరితంగా అధికారులను రైతులకు దూరం చేసే ప్రయత్నం కొంతమంది చేస్తున్నారని మండిపడ్డారు. గులాబీ గూండాల కుట్రలను రైతాంగం అర్ధం చేసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలను కాపాడుకున్నట్లే, అధికారులను కాపాడుకోలేకపోతే పని చేయడానికి ఏ అధికారి ముందుకు వస్తారని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియా తో మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ఇదే పద్ధతి పాటించారా అని నిలదీశారు. రైతులను నష్టపెట్టాలన్నది తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని మంత్రి పొంగులేటి అన్నారు. వారి సమస్యలను వినడానికి, పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని తెలిపారు. రైతుల ముసుగులో అధికారులను చంపే ప్రయత్నం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. లగచర్ల సంఘటను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని అన్నారు. ఈ రోజు అధికారులపై దాడి జరిగినట్లుగానే ..రేపు రాజకీయ నాయకులు, ప్రజలపై దాడి జరిగితే ప్రభుత్వం ఉపేక్షించదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. వికారాబాద్ జిల్లాకు ఫస్ట్ మేజిస్ట్రేట్‌గా ఉన్న కలెక్టర్‌పైనే హత్యాయత్నం చేయడానికి కుట్ర పన్నారని ఆరోపించారు. అధికారుల మీద దాడి జరగడం మనమీద మనం దాడి చేసుకునట్లేనని అన్నారు. ఏం తప్పుచేశారని ఆనాడు ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేసి జైల్లో పెట్టారని ప్రశ్నించారు. మల్లన్నసాగర్‌లో రైతులను దేశద్రోహులుగా చిత్రీకరించారని ఆరోపించారు. పిల్లా, పాపా, ముసలి అనే తేడా లేకుండా రాత్రికి రాత్రి వారిని అరెస్ట్ చేసి సంకెళ్లు వేసిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్లలో దళితులకు బేడీలు వేసిన సంగతి మరిచిపోయారా అని నిలదీశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు

**హైదరారాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విచారణ ముగిసింది. తిరుపతన్నతో మాట్లాడిన ఫోన్ కాల్స్‌పై హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీసులు మాజీ ఎమ్మెల్యేను విచారించారు. ప్రస్తుత నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులైన మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ల ట్యాప్ చేయడంపై పలు పశ్నలు సంధించారు. ఈ ఇద్దరి ఫోన్‌లు ట్యాప్ చేసినట్టు వచ్చిన రిపోర్టును లింగయ్య ఎదుటపెట్టి ప్రశ్నల వర్షం కురిపించారు. మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా డబ్బు తరలింపుపైనా ప్రశ్నలు సంధించారు. విచారణ అనంతరం చిరుమర్తి లింగయ్య మీడియాతో మాట్లాడారు. పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. తనకు తెలిసిన అధికారి కాబట్టి నేను గతంలో అడిషనల్ ఎస్పీ తిరుపతన్నతో మాట్లాడాను. మదన్ రెడ్డి, రాజ్ కుమార్ ఫోన్ నంబర్లు తిరుపతన్న అడిగారు. వారిద్దరి ఫోన్ నంబర్స్ నా అనుచరుల వద్ద తీసుకుని అతనికి ఇచ్చాను. నంబర్లు ఎందుకు ఆడిగావని నేను తిరుపతన్నను ప్రశ్నించా. కానీ మునుగోడు ఎన్నికల సమయంలో ప్రచారం ఎలా జరుగుతుందని తిరుపతన్న నన్ను అడిగారు. ప్రచారం బాగానే జరుగుతోందని నేను ఫోన్లో చెప్పా. ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరుల ఫోన్ ట్యాప్ చేశారనేది అవాస్తవం. మీడియాలో ఎక్స్‌పోజ్ అవ్వాలనే ఉద్దేశంతో కొంతమంది నాపై తప్పుడు కామెంట్స్ చేస్తున్నారు. ఈ కేసులో ఎప్పుడు విచారణకు పిలిచినా పోలీసులకు నేను సహకరిస్తా. ఈ కేసుతో నాకు ఎటువంటి సంబంధం లేదు. తిరుపతన్నతో మాట్లాడిన కాల్ లిస్ట్ ఆధారంగానే నన్ను ప్రశ్నించారు. పోలీసుల దగ్గర ఏదో ఆధారం ఉంది కాబట్టే నన్ను విచారించారని భావిస్తున్నా. నా స్టేట్మెంట్‌ను వీడియో రికార్డ్ చేశారు. ఎప్పుడు విచారణకు పిలిచినా సహకరిస్తాఅని చెప్పారు.

కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలైన బొల్లం మల్లయ్య, పైళ్ల శేఖర్ రెడ్డికి సైతం పోలీసులు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. చిరుమర్తి లింగయ్య విచారణ తర్వాత మల్లయ్య, శేఖర్ రెడ్డిలను విచారించే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటిసారిగా రాజకీయ నేతలను పోలీసులు విచారిస్తున్నారు. ఈ అంశం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మాజీ ఎమ్మెల్యే లింగయ్య విచారణ తర్వాత మరో మాజీ మంత్రికి పోలీసులు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.

## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..స్మితా సబర్వాల్‌కు రేవంత్ రెడ్డి ప్రమోషన్

హైదరాబాద్:పరిపాలనపై పట్టు సాధిస్తున్న క్రమంలో తెలంగాణలో అధికారుల బదిలీలు అనూహ్యంగా జరుగుతున్నాయి. వారాల వ్యవధిలోనే అధికారుల బదిలీలు జరుగుతుండడంతో పరిపాలన అస్తవ్యస్తంగా సాగుతోంది.తాజాగా మరోసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ బదిలీల్లో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కు పదోన్నతి లభించడం గమనార్హం. ఈ బదిలీల్లో జీహెచ్ఎంసీ తాత్కాలిక కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఇలంబర్తి పూర్తిస్థాయి కలెక్టర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

తెలంగాణ రాష్ట్రంలో 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీల్లో స్మితా సబర్వాల్ తో పాటు అనితా రామచంద్రన్, ఇలంబర్తి వంటి అధికారులు ఉన్నారు. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా స్మితను. మహిళా, శిశు సంక్షేమం, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా అనితా రామచంద్రన్‌ను బదిలీ చేశారు. జీ హెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించగా. దేవాదాయ శాఖ కమిషనర్‌గా శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.



VC NEWS వేగుచుక్క
TELUGU DAILY NEWS

# శ్రీ చైతన్య కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

## 'నా చావుకు కొందరు బాధ్యులు' అంటూ సూసైడ్ నోట్

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్:**



'అమ్మానాన్న నన్ను క్షమించండి. నా చావుకు కొందరు బాధ్యులు.. నాతో కావట్లేదు.. నా చావు తర్వాత మీకు సమస్యలు తీరాలి..' అని ఓ స్టూడెంట్ సూసైడ్ నోట్ రాసి అనుమానా స్పదస్థితిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ చైతన్య కాలేజీలో జరిగింది. హైదరాబాద్ నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో గల శ్రీ చైతన్య బాయ్స్ క్యాంపస్ లో కామారెడ్డి జిల్లాకు చెందిన జస్వంత్ గౌడ్(17) ఇంటర్ బైపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం తెల్లవారుజామున అతడు హాస్టల్లో ఫ్యాన్ కు ఉరేసుకున్నాడు. తోటి విద్యార్థులు, సిబ్బంది గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని డాక్టర్లు తెలిపారు. విద్యార్థి తల్లిదండ్రులకు కాలేజీ యాజమాన్యం సమాచారం అందించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి.





## - ఎస్పీ సింధు శర్మ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 14:**

ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలనీ ఎస్పీ సింధు శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల సదన్, బాలికల పాఠశాలలో గురువారం దివంగత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఉన్నత లక్ష్యం సాధించడానికి ఏకాగ్రత అవసరమని, ఇష్టపడి చదివితే తప్పకుండా సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్కిడ్స్ హైస్కూల్'లో ఘనంగా బాలల దినోత్సవం.







**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 14:**








ఆర్కిడ్స్ హై స్కూల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులను నిర్వహించి, స్వయం పరిపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యత భావనను పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా విద్యార్థులు సమస్యలను పరిష్కరించడం, కమ్యూనికేషన్ స్కిల్స్, మరియు టీం వర్క్ లాంటి అనేక ముఖ్యమైన నైపుణ్యాలను విద్యార్థి దశ నుంచే అభివృద్ధి చేసుకునే అవకాశం కల్పించారు.

స్వయం పరిపాలన దినోత్సవంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, కళాప్రదర్శనల వంటి అనేక ప్రత్యేక కార్యక్రమాలు కనులవిందుగా సాగాయి. విద్యార్థులందరికీ ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు మరిచిపోలేని అనుభవంగా కార్యక్రమాలు నిలిచియి.

విద్యార్థులను ఉద్దేశించి, స్కూల్ ప్రిన్సిపల్ అండ్ చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకత, నాయకత్వం, భవిష్యత్ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. "మీరు చూపించిన సామర్థ్యంతో రేపటి సమాజానికి మరింత సమర్థవంతమైన నేతలు అవుతారని నమ్ముతున్నాం" అంటూ విద్యార్థులను అభినందించారు.

ఆర్కే గ్రూప్ విద్యా సంస్థల సిఇఓ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల కృషిని ప్రశంసిస్తూ, "బాలల దినోత్సవం ప్రతి విద్యార్థిలోని మెరుగైన ప్రతిభను గుర్తుచేస్తుందని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను స్వీకరించడం ద్వారా భవిష్యత్ బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారని చూపించారు" అని అన్నారు.

ఆర్చిడ్స్ హై స్కూల్ విద్యార్థులలో ప్రతిభను పెంపొందించడం, కీలకమైన జీవన నైపుణ్యాలను సాధించడానికి స్ఫూర్తిదాయకమైన, ఆవిష్కరణాత్మక విద్యా వాతావరణాన్ని అందించడానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ భూలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థులే ఉపాధ్యాయులుగా "స్వయం పరిపాలన" కార్యక్రమాలు.**

**పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపల్ అండ్ చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి, ఆర్కే గ్రూప్ విద్యా సంస్థల సిఇఓ జైపాల్ రెడ్డి.**

# నేటి బాలలే భావి భారత "వెలుగు దివిటీలు"












**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 14:**



జీవితంలో బాల్య దశ మరిచి పోలేని భాగ్యమని, కల్మషం ఎరుగని జ్ఞాపకాల తేనె పట్టు బాల్యమని నేటి బాలలే రేపటి భావి భారత వెలుగు దివిటీలు అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య అన్నారు. భారత దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి, బాలల దినోత్సవాన్ని సత్యశోధక్ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. మొదటగా ప్రిన్సిపల్ ఆర్ నర్సయ్య జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, ఉన్నత కుటుంబంలో జన్మించిన నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం చెరసాల జీవితమును అనుభవించారని అన్నారు. విలువైన సంపదల కన్నా తనకు పిల్లలంటేనే ఇష్టమని, కల్మషం ఎరుగని పూవుల లాంటి వారు చిన్నారులని నమ్మిన మహోన్నతుడు జవహర్ లాల్ నెహ్రూ అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు, భారతదేశాన్ని పునర్నిర్మించడంలో, ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంలో ఇంకా బలోపేతం చేయడంలో పండిట్ నెహ్రూ పోషించిన పాత్రను భారతదేశం మరువబోదన్నారు. బాలల హక్కులు, వారి సంక్షేమం, వారి సంతోషం గురించి సమాజానికి అవగాహన కల్పించడమే బాలల దినోత్సవం ఉద్దేశమని అన్నారు. నేడు పిల్లల బాల్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, సాంకేతిక ప్రపంచం, సామాజిక మాధ్యమాలు, స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌ల దుష్ప్రభావాలలో చాలా మంది పిల్లలు చిక్కుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల నుంచి వారిని గట్టెక్కించేందుకు మార్గాలు సుగమం చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. భవిష్యత్ తరాల స్థితి గతులకు విద్యార్థి దశ కీలకమని క్రమశిక్షణ వినయం వివేకం అలవర్చుకొని సాధన చేస్తే జీవితాలలో ఇంద్ర ధనస్సులు వెల్లి విరుస్తాయన్నారు. ఈ సంధర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**

**ఘనంగా బాలల దినోత్సవం.**

# సౌత్ క్యాంపస్ లో న్యాక్ పై అవగాహన సదస్సు.

**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, నవంబర్ 14:**



తెలంగాణ యూనివర్సిటీ అంతర్గత నైపుణ్య కమిటీ ఆధ్వర్యంలో న్యాక్ పై అవగాహన సదస్సు వైస్ ప్రిన్సిపల్ డా. రాజేశ్వరి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య వక్తగా ఐక్యూఏసి డైరెక్టర్ డా.ఏ. నాగరాజు, అసోసియేట్ ప్రొఫెసర్ హాజర్తై మాట్లాడారు. యూనివర్సిటీకి న్యాక్ గుర్తింపు పొందటం కోసం అన్ని విభాగాలు తమ తమ విభాగాల అభివృద్ధిపై నివేదికలు తయారు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థి నైపుణ్యాలు పెంచటం కోసం యూనివర్సిటీ చేపడుతున్న కార్యక్రమాలను కూడా నివేదిక రూపంలో తయారు చేసుకోవాలని సూచించారు. ప్రతీ అధ్యాపకుడు న్యాక్ గుర్తింపు కోసం జరిగే పనులలో చురుకుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు డా. యాలద్రీ, డా.సునీత, ఫిజిక్స్ హెడ్ డా.హరిత లక్కరాజు, డా.మోహన్ బాబు, డా.ప్రతిజ్ఞ, డా.అంజయ్య, డా.వీరభద్రం, ఉమెన్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్ వైశాలి, ఏపిఆర్ ఓ డా. సరిత పిట్ల, డా.రమాదేవి, డా. నిరంజన్ శర్మ,శ్రీకాంత్, దిలీప్, డా. శ్రీ మాత, డా. ఇంద్రకరణ్, డా.శ్రీకాంత్, డా.కనకయ్య, డా.వెంకట్ రెడ్డి, పోతన్న, సునీల్, శ్రీనివాస్, డా.కిషన్, డా.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవనభృతి" కోసం కార్మికుల ఆందోళన.

## - బిక్నూర్ తహసీల్దారు కార్యాలయం ముట్టడి.

**వేగుచుక్క న్యూస్, బిక్నూర్, నవంబర్ 14:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవన భృతి పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీడి కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గురువారం బిక్నూర్ మండల కేంద్రంలో బిఎల్ టీయూ, ఏఐఎఫ్ టియూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, కార్యదర్శి ఆంజనేయులు, శ్రామిక శక్తి బీడీ వర్కర్ట్ యూనియన్ (ఏఐఎఫ్ టియూ) రాష్ట్ర అధ్యక్షురాలు అనుసూయ, రాష్ట్ర నాయకురాలు వెంకటలక్ష్మి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ"4016 జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులందరికి ఎలాంటి షరతులు లేకుండా రూ" 4016 జీవన భృతి సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ, ఏఐఎఫ్ టియూ నాయకులు నాగారపు యెల్లయ్య, కె. లింగం, బీడి కార్మికులు పాల్గొన్నారు.





వేగుచుక్క
TELUGU DAILY NEWS
www.vegschukkanews.com

# రైతుకు నష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు.

- జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు.
- ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన.
- ప్రతి రైతుకు పూర్తి మద్దతు ధర అందిస్తామని వెల్లడి.
- తరుగు, కడ్తా పేరిట కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 14**

ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతు పంట అమ్మకాల సందర్భంగా ఏ దశలోను నష్టపోకుండా తమ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోందని జిల్లా ఇన్చార్జ్ మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు.

నిజామాబాద్ జిల్లాలో గురువారం స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి జూపల్లిసుడిగాలి పర్యటన జరిపారు. డిచ్పల్లి మండలం మెంట్రాజ్ పల్లి, ఆర్మూర్ మండలం పెర్కిట్, ఎడపల్లి మండలం ఠాణాకలాన్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం అందుబాటులో ఉన్న సదుపాయాలు తనిఖీ చేశారు. రైతుల నుండి సేకరించిన ధాన్యం వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే వారికి మద్దతు ధర, బోనస్, ధాన్యం రకం, ఎంత పరిమాణంలో ధాన్యం సేకరించారు, బిల్లు రూపేణా ఎంత మొత్తం చెల్లించబడుతుంది తదితర అన్ని వివరాలు పొందుపరుస్తూ రైతుకు సంబంధిత అధికారి సంతకంతో కూడిన రసీదు అందించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రం నుండి ధాన్యం నిల్వలు రైస్ మిల్లుకు రవాణా చేయడానికి ముందే విధిగా రైతుకు రశీదు ఇవ్వాలన్నారు. దీనివల్ల రైతులు రైస్ మిల్లుల వద్ద కోతల పేరిట నష్టపోకుండా నిలువరించవచ్చని సూచించారు. ఎక్కడ కూడా తరుగు, కడ్తా పేరుతో కోతలు విధించకుండా పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒక అధికారి చొప్పున నియమించాలని, అవసరమైతే ఇతర శాఖల అధికారులకు ధాన్యం సేకరణపై శిక్షణ ఇచ్చి వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్క రైతు నష్టపోవడానికి వీలు లేదని, దళారీల ప్రమేయం లేకుండా చూడాలని అన్నారు.

**ఇంటింటి సర్వే పరిశీలన**

కాగా, అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డిచ్పల్లి మండలం మెంట్రాజ్ పల్లిలో సర్వే ద్వారా వివరాలు సేకరిస్తున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాల వారికి సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా లబ్ది చేకూర్చేందుకే ప్రభుత్వం సమగ్ర సర్వే జరిపిస్తోందని అన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మంత్రి రైతులతో భేటీ అయ్యారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు పి.సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, పి.రాకేష్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవలు కొనసాగుతున్నాయి.

## నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం: డీఐజీ రమేశ్ రెడ్డి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 14:**




ఉమ్మడి జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు నిలిపివేసినట్లు వస్తున్న వార్తలు అవాస్తవమైనవని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నిజామాబాద్ డీఐజీ రమేశ్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ ప్రసూన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పది రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో సేవలు అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది ఎలాంటి బంద్‌లు పాటించడం లేదని స్పష్టం చేశారు. కొందరు దస్తావేజు లేఖర్లు మాత్రమే సేవలు నిలిపివేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, దానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ తెరిచి ఉన్నాయని కావున ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి నేరుగా సంబంధిత సబ్ రిజిస్ట్రార్లను సంప్రదించి యదవిధిగా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చు అని వారు వెల్లడించారు.

# ఏసీబీకి చిక్కిన లింగంపేట్ ఎస్సై

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 14:**




లింగంపేట ఎస్సై అరుణ్, కానిస్టేబుల్ రామస్వామి ఏసీబీకి చిక్కారు. రూ.10 వేలు లంచం తీసుకుంటూ గురువారం అనిశాకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌రౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సై అరుణ్, కానిస్టేబుల్ రామస్వామి లింగంపేట మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కేసు నుంచి తప్పించేందుకు రూ.70వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేస్తానని బెదిరించగా బాధితుడు 20 రోజుల కిందట రూ.30 వేలు ఇచ్చాడు. మరో 40 వేలు ఇవ్వాలని వేధించడంతో ఆ వ్యక్తి అనిషా అధికారులకు ఫిర్యాదు చేశాడు.

# జీవన శైలిలో మార్పుతో షుగర్ వ్యాధి అరికట్టవచ్చు.






**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 14:**

> **ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా. దామోదర్ రావు, డా. కె. శ్రీశైలం.**
>
> **ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం.**

ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ప్రాణామయం చేయడం తో పాటు జీవన శైలిలో మార్పు చేసుకుంటే మానసిక ఒత్తిడి, షుగర్ వ్యాధిని నివారించవచ్చని ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా. దామోదర్ రావు, కె. శ్రీశైలం అన్నారు. ఐఎంఏ జిల్లా శాఖ, భారతీయ పిల్లల వైద్యుల సంఘం అధ్వర్యంలో గురువారం నగరంలోని వేర్వేరు ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహించారు. మారుతి నగర్ స్నేహ సొసైటీ భవనంలో, భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఖలీల్ బాడీలోని సన్ రైస్ ఆసుపత్రిలో ప్రపంచ డయాబెటిస్ దినోత్సవం పురస్కరించుకొని రోగులకు వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ, షుగర్ వ్యాధి పై పేషెంట్లకు అవగాహన కల్పించారు. షుగర్ వ్యాధి గురించి ఎవరు కూడా భయపడ వలసిన అవసరం లేదని, వ్యాధి వచ్చాక వైద్యుని పర్యవేక్షణ లో చికిత్స తీసుకొని వ్యాధిని అదుపులో ఉంచు కోవాలని అన్నారు. ప్రజలు తీసుకొనే ఆహారంలో జంక్ ఫుడ్ కాకుండా ఆరోగ్య కరమైన ఆహారాన్ని సరైన సమయంలో తీసుకుంటే ఈ వ్యాధిని నయం చేయవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డా. దామోదర్ రావు, ప్రధాన కార్యదర్శి డా. కె. శ్రీశైలం, ఐఏపీ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి డా. నేతి బాలెష్, కోశాదికారి డా. రాజేంద్ర ప్రసాద్,
డా. అజ్జ శ్రీనివాస్, డా. వినోద్ కుమార్ గుప్తా, డా. వినయ కుమార్, డా. రాఘవేంద్ర, డా. గాంధీ, డా. గోపి కృష్ణ, డా. శ్రీధర్ రావు, డా. అర్చన, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


# జవహర్ లాల్ నెహ్రూకు ఘన నివాళులు.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 14**

దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, రాకేష్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ అందించిన సేవలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మీ బ్రతుకంతా కుట్రలేనా



హైదరాబాద్:మీ బ్రతుకంతా కుట్రలమయం. ఒక్కసారి మీ పరిపాలనలో ఏమేమి పాపాలు చేశారో, ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. తెలంగాణ అభివృద్ధికి ఆటంకం మీరు. మీకు అభివృద్ధి చేయడం చేతకాదు.. చేస్తుంటే సహించలేరు.. ఇదే మీ వక్రబుద్ధి అంటూ కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు.హైదరాబాద్ లోని పీసీసీ కార్యాలయంలో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా విమర్శలు చేశారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బలవంతంగా రైతుల భూములను లాక్కున్న విషయాన్ని కేటీఆర్ మరచిపోయారన్నారు. బీఆర్ఎస్ పావలా పనిచేసి రూపాయి పబ్లిసిటీ చేసుకోవడంలో ఎప్పుడు ముందుంటుందన్నారు.తమ ప్రభుత్వం హయాంలో రైతుల అభిప్రాయ సేకరణకై గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, బీఆర్ఎస్ మాత్రం అందుకు భిన్నంగా బలవంతంగా రైతుల భూములను లాక్కున్నట్లు విమర్శించారు. కొడంగల్ ప్రాంతం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి పరిశ్రమలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని, ఆ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్లపూరితంగా వ్యవహరిస్తుందన్నారు.మల్లన్న నిర్వాసితులపై పోలీసులతో అడ్డుకొని, దాడి చేయించిన ఘటనలు బీఆర్ఎస్ హయంలో జరిగాయన్నారు. అధికారం పోయిందన్న అక్కసుతో బీఆర్ఎస్ కుట్రలు పన్నుతుందని, ప్రజలు ధర్నాలు కూడా చేయకుండా ధర్నా చౌక్ ను ఎత్తేసిన ఘనత బీఆర్ఎస్ కే దక్కుతుందన్నారు. తెలంగాణను దోచుకున్న దొంగల ముఠాగా బీఆర్ఎస్ పార్టీని అభివర్ణించిన జగ్గారెడ్డి.. మీ బ్రతుకంతా కుట్రలమయం అంటూ ఫైర్ అయ్యారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సమయం నుండి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, తాము రూపాయి పనిచేసి పావలా పబ్లిసిటీ కూడా చేసుకోలేకపోతున్నట్లు జగ్గారెడ్డి నిరాశక్తత వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నాన్ని కేటీఆర్ ఇప్పటికైనా మానుకోవాలని, తెలంగాణ అభివృద్ధి కావద్దన్నది వారి కుట్రగా జగ్గారెడ్డి విమర్శలు గుప్పించారు.ఇప్పటికే తాము మహిళలకు ఫ్రీ బస్సు, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చామని, అలాగే పలు జాబ్ నోటిఫికేషన్స్ తో నిరుద్యోగులకు ఉద్యోగ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. త్వరలోనే మహిళలకు నెలకు రూ. 2500 లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు, అలాగే పెన్షన్ కూడా పెంచే నిర్ణయాన్ని ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకోవడమే లక్ష్యంగా ఎంచుకున్న బీఆర్ఎస్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని జగ్గారెడ్డి అన్నారు.

# నెహ్రూ నిర్ణయాలతోనే ప్రపంచ స్థాయికి భారతదేశం

తొలి ప్రధాని నెహ్రూ నిర్ణయాలతోనే భారతదేశ ప్రపంచ స్థాయిలో నిలిచిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్లో చాచా నెహ్రూ జయంతి వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

నెహ్రూ గురించి తెలియని కుహనా మేధావులు కొందరు అక్కడక్కడ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. భారతదేశ చరిత్ర, స్వాతంత్ర సంగ్రామం గురించి తెలుసుకుంటే నెహ్రూ గారి పాత్ర ఏంటో అర్థం అవుతుంది అన్నారు. ఉన్నత కుటుంబంలో పుట్టిన నెహ్రూ దశాబ్ద కాలం పైబడి ఈ దేశం కోసం జైల్లో మగ్గిన మహానుభావుడని కీర్తించారు. నెహ్రూ ఈ దేశపు తొలి ప్రధాని కావడం మన అందరి అదృష్టం అన్నారు. ఈ దేశంలో అనేక సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్లు పెద్ద ఎత్తున నెలకొల్పుడంతోనే ఈ దేశం అభివృద్ధి జరుగుతుంది అన్నారు. చంద్రమండలం,
మార్స్ పైకి రకరకాల సాటిలైట్స్ పంపి సమాచార వ్యవస్థలో పోటీకి కారణం నాటి నెహ్రూ నిర్ణయాలే అని అన్నారు. విద్యా విధానం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు ప్రభుత్వ రంగంలోనే ఉండాలన్న ఆయన నిర్ణయం, ఆలోచనల ఫలితంగానే మన దేశం నేడు బతుకుతుంది అన్నారు. సైంటిఫిక్ అవగాహన లేని మూఢవిశ్వాసాలతో బతికే మోడీ వంటి వారు మొదట ప్రధానిగా ఉంటే ఈ దేశం మూఢవిశ్వాసాలతో ఎక్కడో వెనుకబడి ఉండేది అన్నారు. నెహ్రూ వేసిన పునాదుల ఫలాలు నేడు మనమందరం అనుభవిస్తున్నాం అన్నారు. కేటీఆర్ గురించి మాట్లాడాలంటే చాలా మాట్లాడవచ్చు, ప్రభుత్వ వైఫల్యం ఏంటో కేటీఆర్ చెప్పాలి అన్నారు. నిరుద్యగులకు ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ వైఫల్యమా?.

# డబ్బింగ్ స్టూడియో రష్మీకా..

కన్నడ భామ రష్మిక మందన్నా ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. వీటిలో ఒకటి మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంఛైజీలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ బ్యూటీ డబ్బింగ్ స్టూడియోలో ఉన్న స్టిల్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్స్‌ను షేర్ చేసుకుంది. శ్రీవల్లి పాత్రకు డబ్బింగ్ చెబుతున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పుడు వినోదం, ఆటలు ముగిశాయి. బిజినెస్ నుంచి దిగిపోవాల్సిన టైం వచ్చేసింది. పుష్ప షూటింగ్ దాదాపు పూర్తయింది. పుష్ప ది రూల్ ఫస్ట్ హాఫ్ డబ్బింగ్ పూర్తయింది. ప్రస్తుతం సెకండాఫ్ డబ్బింగ్ కొనసాగుతోంది. సినిమా ప్రేక్షకులకు మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌ప్రీరియన్స్ అందించడం పక్కా. వెయిట్ చేయలేక పోతున్నానంటూ రాసుకొచ్చింది రష్మిక మందన్నా.

ఇప్పుడీ స్టిల్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు పుష్ప మూవీ లవర్స్. ఫస్ట్ పార్టుకు సూపర్ హిట్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా అదిరిపోయే ఆల్బమ్ రెడీ చేసినట్టు ఇప్పటికే విడుదలైన పాటలు చెబుతున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# మరో మగాడే లేనట్లు.. మా నాన్న కావాలా..?



టెలివిజన్ నటి రూపాలీ గంగూలీ..సారాభాయ్ వర్సెస్ సారాభాయ్, అనుపమ అనే సీరియల్స్‌తో ఎంతో గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో 'ప్రేమంటే ఇంతే' అనే సినిమాలో కూడా ఒక కీలక పాత్రలో నటించింది. టెలివిజన్ ఇండస్ట్రీలోనే రిచెస్ట్ నటిగా రూపాలీ రికార్డ్ క్రియేట్ చేసింది. 2013లో వ్యాపారవేత్త అయిన అశ్విన్ కె వర్మను వివాహం చేసుకుంది. అయితే అప్పటికే అశ్విన్‌కు పెళ్లి అయ్యి ఒక కుమార్తె కూడా ఉంది. ఆమె పేరే ఇషా. రూపాలీని పెళ్లి చేసుకోవడానికే అశ్విన్.. మొదటి భార్య స్వప్నకు విడాకులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అశ్విన్‌కు రూపాలీ జంటకు ఒక బాబు ఉన్నాడు. నిత్యం సోషల్ మీడియాలో ఆమె తన కుటుంబంతో కలిసి దిగిన ఫోటోలను రూపాలీ షేర్ చేస్తూ ఉంటుంది. అయితే రూపాలీ గురించి అశ్విన్ మొదటి భార్య కూతురు అయినా ఇషా ఒక వీడియోలో సంచలన వ్యాఖ్యలు చేసింది. "నా తండ్రిని ఆమె దూరం చేసింది. నా తల్లికి అన్యాయం చేసింది. పెళ్లి అయిన మగాడితో సంబంధం పెట్టుకొని నా కుటుంబాన్ని విడగొట్టింది. బలవంతంగా నా తండ్రి చేత విడాకుల పత్రాలపై సంతకం చేసేలా చేసింది. రూపాలీ కోసమే మా నాన్న మలేషియా వదిలి ఇండియాకు వెళ్ళిపోయాడు. మరో మగాడే లేనట్లు.. పెళ్లి అయిన మగాడితో సంబంధం పెట్టుకోవడం తప్పు" అంటూ మాట్లాడింది. ఈ వీడియో నెట్టింట పెద్ద దుమారాన్నే రేపింది. ఈ వీడియోపై రూపాలీ కూడా సీరియస్ అయ్యింది. ఇషాపై రూ. 50 కోట్లకు పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటీసులు పంపించింది. దీంతో ఇషా ఆ వీడియోను డిలీట్ చేయడమే కాకుండా.. తన ఇన్‌స్టా అకౌంట్‌ను ప్రైవేట్‌లో పెట్టింది. బాలీవుడ్‌లో ఇప్పుడీ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

# కంగువా స్పెషల్ షోకు సర్కార్ అనుమతి



దర్శకుడు సిరుత్తై శివ - హీరో సూర్య కాంబినేషన్‌లో రూపొందిన 'కంగువా' చిత్రం ఈ నెల 14వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకానున్న నేపథ్యంలో అదనపు ఆట (స్పెషల్ షో)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రోజూ ప్రదర్శించే నాలుగు ఆటలతో పాటు అదనంగా మరో ఆట వేసేందుకు అంగీకారం తెలిపింది. అయితే, తొలి షో ఉదయం 9 గంటలకు, చివరి ఆట అర్ధరాత్రి 2 గంటల్లోపు ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ సహా ఏకంగా పదికిపైగా భాషల్లో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పెషల్ షో ప్రదర్శనకు అనుమతివ్వాలంటూ నిర్మాణ సంస్థ చేసిన విజ్ఞప్తికి తమిళ నాడు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఒక్క రోజు మాత్రమే అదనపు ఆట ప్రదర్శించుకునేందుకు అనుమతిచ్చింది. ఇటీవల ఏ సినిమాకు కూడా తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి ఇవ్వలేదు. ఒక థియేటర్‌లో బెనిఫిట్ షో జరిగిన యాక్సిడెంట్ తర్వాత, తమిళనాడు ప్రభుత్వం అదనపు షోలకు అనుమతి నిరాకరిస్తూ వస్తోంది. పెద్ద హీరోలు రజనీకాంత్, కమల్ హాసన్, విజయ్ వంటి వారి సినిమాలకు కూడా అదనపు షోలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇంతకు ముందు వచ్చిన విజయ్ 'ది గోట్' సినిమాకు మాత్రం ఉదయం 9 గంటల ఆటలకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు సూర్య సినిమాకు ఉదయం 9 గంటల ఆటతో పాటు రాత్రి 2 గంటల లోపు మరో ఆటను ప్రదర్శించుకునేలా అనుమతి ఇవ్వడం విశేషం. అయితే, అనుమతి ఇచ్చినప్పటికీ అది ఒక్క రోజుకే పరిమితం చేయడం గమనార్హం. అలాగే ఎర్లీ మార్నింగ్ షోలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు.

# వంగా సందీప్‌రెడ్డితో ప్రభాస్ మూవీ



గ్లోబల్ స్టార్ ప్రభాస్ యానిమల్ ఫేం సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేయబోతున్నాడని తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్ట్ స్పిరిట్. కాగా సినిమా ఎప్పుడు మొదలవుతుందంటూ తెగ చర్చించుకుంటున్న అభిమానులకు క్లారిటీ ఇచ్చేశాడు టీ సిరీస్ ఎండీ భూషణ్‌కుమార్. ఈ విషయంపై భూషణ్‌కుమార్ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇస్తూ.. స్పిరిట్ సినిమా పూజా కార్యక్రమం డిసెంబర్‌లో ఉండబోతుంది. సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం స్క్రిప్ట్ రైటింగ్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి పాటలు సిద్ధం చేసే పనిలో ఉన్నాడు. స్పిరిట్ పూర్తిగా కాప్ డ్రామా నేపథ్యంలో ఉండబోతుంది. రెగ్యులర్ షూటింగ్ 2025 జనవరి నుంచి షురూ కానుంది. త్వరలోనే దీని గురించి ప్రకటిస్తాం. అంతేకాదు కేవలం 6 నెలల గ్యాప్‌లోనే స్పిరిట్ షూట్ పూర్తి చేస్తాం. 2026 ప్రథమార్ధంలో విడుదల చేస్తామని క్లారిటీ ఇచ్చాడు. భూషణ్ కుమార్ కామెంట్స్ ప్రభాస్ అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తున్నాయి. స్పిరిట్‌లో పాపులర్ సౌత్ కొరియన్ యాక్టర్ మడాంగ్‌సియోక్ విలన్‌గా కనిపించబోతుండగా.. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ పాన్ ఆసియన్ మూవీని భారతీయ భాషలతోపాటు చైనీస్, కొరియన్ భాషలో విడుదల చేసేలా ప్లాన్ రెడీ చేసిందట సందీప్ రెడ్డి వంగా టీం. ఇక ప్రభాస్ కెరీర్‌లో తొలిసారి స్పిరిట్ సినిమా కోసం ఖాకీ డ్రెస్ వేసుకుంటుండటంతో ఎక్జయిటింగ్‌కు లోనవుతున్నారు అభిమానులు. ఈ మూవీని సందీప్‌రెడ్డి వంగాతో కలిసి టి సిరీస్ అధినేత భూషణ్‌కుమార్ స్పిరిట్ నిర్మిస్తున్నారు.



# బహుబలి.2ని పుష్ప.2 బీట్ చేస్తుందా..?





ప్రస్తుతం పాన్ ఇండియా ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2. 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ పుష్ప సినిమాకు సీక్వెల్‌గా వస్తుంది ఈ చిత్రం. అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా విడుదలకు ఇంకా నెల రోజులు కూడా లేదు అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. మరోవైపు ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా టీం కూడా ఫుల్ బిజీగా గడుపుతుంది.

ఇప్పటికే ఇండియా వైడ్ భారీ ఈవెంట్‌లను ప్లాన్ చేసిన చిత్రబృందం బిహార్ రాజధాని పాట్నాలో పుష్ప 2 ట్రైలర్‌ను నవంబర్ 17న లాంఛ్ చేయనుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా సృష్టించే రికార్డులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. కొందరు ఏమో ఈ సినిమా అమీర్ ఖాన్ నటించిన దంగల్ రికార్డును బద్దలు గొడుతుందని కామెంట్లు చేస్తుండగా.. మరికొందరు ఈ మూవీ ప్రభాస్ ఆల్‌టైం రికార్డు ఉన్న బాహుబలి 2 సినిమా కలెక్షన్లను బద్దలు కొడుతుందని కామెంట్లు పెడుతున్నారు. ఒకవేళ ఇదే జరిగితే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో సరికొత్త రికార్డును సృష్టించనున్నాడు. ఎందుకంటే ఇప్పటివరకు అత్యధిక కలెక్షన్లు సాధించిన ఇండియన్ సినిమాలు చూసుకుంటే మొదటి స్థానంలో అమీర్ ఖాన్ నటించిన దంగల్ (రూ.2100 కోట్లు) ఉండగా.. రెండో స్థానంలో బాహుబలి 2(రూ.1800 కోట్లు) ఉంది. వీటి తర్వాత ఆర్‌ఆర్‌ఆర్(రూ.1300 కోట్లు), కేజీఎఫ్(రూ.1200 కోట్లు) చిత్రాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 చిత్రం ఇండియా వైడ్‌గా రూ.400 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ చిత్రంకు వచ్చిన పాపులారిటీ వలన ఇప్పుడు కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.